క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక కోర్టు సముదాయాల సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్. తేజా చక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో విద్యార్థుల్లో 'గుడ్, బ్యాడ్ టచ్' అనే అంశంపై విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌బీకేలకు పశుదాణా రాక



చీపుర్లపాడులో పశుదాణాను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు, చీపుర్లపాడు, నీలంపేట, తిర్లంగి రైతుభరోసా కేంద్రాల పరిధిలోని పాడి రైతుల కోసం 500 పశుదాణా ప్యాకెట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆదివారం వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం నుంచి ఆయా కేంద్రాలకు దాణా ప్యాకెట్లను లారీలో తరలించారు. అనంతరం వాటిని ఏడీ ఎం.లోకనాథం ఆదేశాల మేరకు ఆర్‌బీకే ఇన్‌చార్జిలు పాడి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జిలు ముకుందరావు, శోభా, తరుణమ్మ, నారాయణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక వంశధార డిగ్రీ కళాశాల వీధిలో రూ. పది లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచ్ కాల్ల సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు కె శ్రీనివాసరెడ్డి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరావు పాల్గొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

వంతెన నిర్మించాలి

టెక్కలి: మేఘవరం పంచాయతీ పరిధి మేలిసతివాడ–రావిపాడు గ్రామాలను కలుపుతూ ఉన్నటువంటి గెడ్డ వద్ద వంతెన నిర్మాణం చేయాలని బీజేపీ నాయకులు పరమేశ్వరరావు, లింగరాజు, కామరాజు కోరారు. ఆదివారం ఆయా ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గెడ్డ వద్ద వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు మృతికి సంతాపం



భాస్కరరావు(ఫైల్)

నందిగాం: ప్రతాప విశ్వనాధపురం పంచాయతీ చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు, వైఎస్సార్ సీపీ కార్యకర్త పొట్నూరు భాస్కరరావు (50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య ఉత్తరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భాస్కరరావు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.


బీచ్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు తీరంలో హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేసి పర్యాటకులను అప్రమత్తం చేసా రు. ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. సరదా కోసం తీరానికి వచ్చే పర్యాటకులు జా గ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగరాదని, లోతట్టు ప్రాంతానికి స్నానాలకు వెళ్లరాదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డొంక విద్యాసాగర్ ఉన్నారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: దేశవ్యాప్తంగా ఈ నెల 30 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న సమరభేరి కార్యక్రమానికి చెందిన వాల్‌పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆదివారం కాశీబుగ్గలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, నాయకులు నెయ్యిల గణపతి, జన్ని భాగ్యలక్ష్మి, ఎస్.ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

● సాయం..



కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన చిన్నారి యాండ్రాపు ఆద్య హెచ్ఎల్‌హెచ్ అనే వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నం మహాత్మాగాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న నీలాపుట్టుగ గ్రామానికి చెందిన యువకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేరో పది వేల రూపాయలు సేకరించారు. మొత్తం రూ. 20 వేలను చిన్నారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి అండగా నిలిచారు. -ఇచ్ఛాపురం రూరల్

● సత్కారం..



గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలుగు భాషో దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. పలాసకు చెందిన జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తెలుగు భాషోద్యమ కిరీటి గిడుగు అనే కవితను గానం చేశారు. దీంతో నిర్వహకులు కృష్ణమూర్తిని సత్కరించి మెమెంటో అందజేశారు. -కాశీబుగ్గ

● పంపిణీ..



మదర్ థెరిసా జన్మదినోత్సవంలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ పలాస-కాశీబుగ్గ సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు ఆర్.హేమాచలం, కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి ఎస్.అప్పారావు, ఎన్ఆర్‌వి కణితి హేమాచలం, కేపి రామన్న, సిందిరి మధుసూదనరావు, ఎల్.కొండలరావు, బమ్మిడి నాగేశ్వరరావు, ఉమాశంకర్ పాల్గొన్నారు. -కాశీబుగ్గ

దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

- ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు మంచి చేస్తుంటే దాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ, ఇతర ప్రతిపక్షాల నాయకులు లేని పోని దుష్ప్రచారం చేస్తున్నారని.. దీన్ని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలంతా సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పార్టీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి కోరారు. నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలతో ఆదివారం టెక్కలిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంలో సోషల్ మీడియా కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ కోసం శ్రమిస్తున్న వారి భవిష్యత్ కోసం సీఎం జగన్ మంచి ఆలోచన చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఈ విషయంలో ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని సోషల్ మీడియా కార్యకర్తలంతా మరింత సమర్థవంతంగా పనిచేయాలని.. వారికి ఎటువంటి అవసరమైన పార్టీ తరపున నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. పేద, సామాన్య వర్గాల సంక్షేమం కోసం సీఎం చేస్తున్న ప్రతి మంచి పనికి ప్రతిపక్షాలు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని అడ్డంకిగా మారుతున్నాయని ఇటువంటి కుట్రలను తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి సోషల్ మీడియా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఆక్రమణదారునికి నోటీసులు



పాతపట్నంలో నిబంధనలు అతిక్రమించి చేపట్టిన భవన నిర్మాణం

ఎల్.ఎన్.పేట (పాతపట్నం): పాతపట్నం మేజర్ పంచాయతీ అంతరాబ (అచ్యుతాపురం) గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 13/6, 3/1లో అక్రమ భవన నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినందున నోటీసులు జారీ చేసినట్లు ఈఓ టి.కూర్మారావు ఆదివారం ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను 2019 జనవరిలో బిల్డర్ పొందారన్నారు. అక్రమ నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నందున సంజాయిషీ కోరుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీన నోటీసులు జారీ చేశామన్నారు. బిల్డర్ ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేనందున నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతి కోరిన కంటే అదనంగా స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. ఇచ్చిన అనుమతి కంటే పక్క స్థలాల్లో నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. భవన నిర్మాణ ప్లాన్‌లో చూపిన విధంగా కాకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్లాన్‌లో చూపిన విధంగా గ్రౌండ్ ఫ్లోర్, రెండో ఫ్లోర్ నిర్మాణం చేయలేదన్నారు. చట్ట విరుద్ధంగా క్రయవిక్రయాలు జరిపారని వివరించారు. తూర్పు వైపున ఉన్న చెరువు గట్టుపై నడకతోవ సుమారు 341.89 చదరపు మీటర్లు ఆక్రమించి ప్రహరీ, అక్రమ భవన నిర్మాణం చేశారన్నారు. అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్న స్థలం కంటే అదనపు స్థలం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆక్రమణలు సొంత ఖర్చులతో తొలగించాలని సదరు బిల్డర్‌ను కోరామన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో పంచాయతీ అధికారులే తొలగించి, ఖర్చులు బిల్డర్ వద్ద నుంచి వసూలు చేయటం జరుగుతుందన్నారు.

సత్యసాయి సేవలు విస్తృతం చేయాలి



ఆహ్వానిస్తున్న జిల్లా సేవాదళ్ సమన్వయ కర్త రామచంద్రరావు

హిరమండలం: సత్యసాయి సేవలు మరింత విస్తృతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సమన్వయకర్త ఎస్.రామచంద్రరావు, మహిళా సన్వయకర్త అమ్మన్నమ్మ అన్నారు. స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. సెప్టెంబర్ మూడో తేదీన శ్రీకాకుళం మున్సబ్‌పేట గాయత్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా సత్యసాయి సేవాదళ్ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సభ్యులకు ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికలను అందజేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు హాజరుకావాలని కోరారు. బాబా వందో జయంతి నాటికి జిల్లాలో మరింతగా సేవలు విస్తృతం చేయాలని కోరారు. ప్రేమతో సేవ చేయడం ద్వారా భగవంతుని ఆశీస్సులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ పప్పల అప్పలనాయుడు, సమితి కన్వీనర్ వెంకటరావు, ఆశ్రమ కో ఆర్డినేటర్ ఎ.సాయిబాబా, సభ్యులు చంటి మాస్టర్, కె.జయరాం, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ బుట్టల పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశామని సర్పంచ్ ముద్దాడ మోహిని ఆదివారం తెలిపారు. ఇంటిలో తడి, పొడి చెత్తను వేరువేరుగా బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ఇంట్లోని చెత్తను తీసుకుని వచ్చి వీధుల్లో పడేయకూడదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దాడ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రావాడ సరోజిని, ఫీల్డ్ అసిస్టెంట్ రావాడ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



బీమా సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: లండారిపుట్టుగ పంచాయతీ కొండిపుట్టుగ గ్రామానికి చెందిన కొర్రాయి పద్మ ఇటీవల మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌బీమా పాలసీదారు. దీంతో కుటుంబానికి తక్షణ సాయంగా పది వేల రూపాయలు మంజూరైంది. ఈ మొత్తాన్ని పద్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అందిస్తున్న వైఎస్సార్‌బీమా వరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: నువాగడ పంచాయతీ పరిధి దొలాయి సాయి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు సాయం చేసి అండగా నిలిచాయి. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరపున 15 సిమెంటు రేకులు, సీతయ్య ఫౌండేసన్ తరపున చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలను ఆయా సంఘ ప్రతినిధులు ఆదివారం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి



వెన్నెలవలస గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సరుబుజ్జిలి: పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అటవీ సెక్షన్ అధికారి ధర్మారావు తెలిపారు. వెన్నెలవలస, బసిమానిగూడ, బొడ్లపాడు గ్రామాల్లో ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. బయటకు వెళ్లే సమయంలో ఎటువంటి ఆయుధాలు లేకుండా ఒంటరిగా ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. ప్రజలంతా గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. పోడు వ్యవసాయం కోసం వెళ్లే గిరిపుత్రులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బీట్ ఆఫీసర్ జకీర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహా అన్నప్రసాదం పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

ఆమదాలవలస: మెట్టక్కివలసలో గల భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నార్థులకు (పేదలకు) స్థానిక రైల్వేస్టేషన్, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో ఆదివారం అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు, భక్తులు డాక్టర్ పి.తాతయ్యలు, తమ్మన బంగారు రాజు, ఎ.గజపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్య నారాయణ స్వామి కల్యాణ ఉత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నిజ శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు సాందీప్‌శర్మ కల్యాణాన్ని ఆగమశాస్త్రం ప్రకారం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనూరాధ, అజిత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయకర్త సాయిరాజ్‌కు సత్కారం



సాయిరాజ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కవిటి: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నియామకాల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన కేడర్‌కు సముచిత స్థానం కల్పించడంలో సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చూపిన చొరవ అభినందనీయమని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు బల్లిపుట్టుగలోని ఆయన నివాసంలో సాయిరాజ్‌ను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు. జిల్లా పార్టీ కార్యవర్గంలో బైపల్లి రామారావు (సెక్రటరీ), కార్య నిర్వాహక సభ్యులుగా మాస్టిల మంజు, తిప్పన నాగరాజు, గూడ తాతారావు, పొల్లాయి నీలాచలంలను ఎంపిక చేయడంలో సహకరించిన సాయిరాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతిన శేషగిరి, గొరకల లింగరాజు, దున్న మాధవరావు, దున్న దుర్యోధన, నర్తు మోహనరావు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోషల్ మీడియా సభ్యుల ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి హాజరైన తిలక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కలి నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. మూలపేట పోర్టు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు, వివిధ వంతెనలు, 68 బీటీ రహదారులు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, విత్తనోత్పత్తి కేంద్రం, ఇంటింటికీ కుళాయిలు వంటివి ఏర్పాటు చేశారని, అలాగే నియోజకవర్గంలో సుమారు రూ.15 వందల కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. వీటన్నింటినీ సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో ఇద్దరిని సోషల్ మీడియా విభాగంలోకి తీసుకొని వారి ద్వారా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో చిన్ని జోగారావు, అంబోడి విష్ణు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రవచనాలు చెబుతున్న నికేతన్ స్వామి

సారవకోట: మానవులు ఈర్ష్యాద్వేషాలను విడనాడాలని నికేతన్ స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జ్ఞాన సమాజం ఆధ్వర్యంలో 85వ సత్సంగ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో బోధించిన ప్రతీ అంశం మానవ దైనందిన జీవితానికి ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలన్నారు. రాంబాబు, అల్లు రామయ్య, సోమేశ్వరరావు, రామదాస్ తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆనెం అప్పలస్వామి, జాడ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేపడుతున్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: శ్రావణ మాసంలో పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతను ఆదివారం బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పారాయణం చేశామని స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 29 మంది శ్రావణ మాసం సందర్భంగా పురాతన వేణుగోపాలస్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేయనున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ఆదివారం వేణుగోపాల స్వామి ఆలయంలో పారాయణం చేయడం జరిగిందన్నారు. వచ్చే సెప్టెంబర్ 10వ తేదీన టీ.లింగాలపాడులోని వేణుగోపాల స్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు మూడు ఆలయాల్లో పూర్తి చేశామన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ తరగతులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరేరామ మందిరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత శ్లోక కంఠస్థ తరగతులను ఆదివారం నిర్వహించారు. పరాత్మానంద సరస్వతి స్వామీజీ భగద్గీతలోని నాల్గో అధ్యాయంలో గల జ్ఞాన కర్మ, సన్యాసయోగంలోని శ్లోకాలను చిన్నారులతో పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణం ద్వారా మనిషి ఎలా జీవించాలో తెలుస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధి కె.వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.